కేసీఆర్‌తోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి

బీఆర్‌ఎస్‌ అధినేత, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ జన్మదిన వేడుకలను జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆ పార్టీ నేతలు పలుచోట్ల కేక్‌ కటింగ్‌లు, పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం వంటి కార్యాక్రమాలు చేపట్టి కేసీఆర్‌పై తమ అభిమానం చాటుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యా సంస్థల్లో వేడుకలు జరుపుకున్నారు. తెలంగాణ జాతిపిత సీఎం కేసీఆర్‌ అని నేతలు కొనియాడారు. ఆయన సారథ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని అన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీతో దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

– సాక్షి, నెట్‌వర్క్‌


తాండూర్‌ టౌన్‌: కేక్‌ కట్‌ చేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి


తాండూరు టౌన్‌: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదానం


ధారూరు: కేక్‌ తినిపించుకుంటున్న నాయకులు


మోమిన్‌పేట: విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేసిన నాయకులు


పెద్దేముల్‌: కేక్‌ కట్‌ చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు


తాండూరు: వేడుకలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్‌ నాయకులు


పరిగి: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


అనంతగిరి: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


కుల్కచర్ల: వేడుకల్లో జెడ్పీటీసీ రాందాస్‌ తదితరులు


యాలాల మండల కేంద్రంలో..


కోట్‌పల్లి మండల కేంద్రంలో..

క్లుప్తంగా

ఘనంగా బసవేశ్వర ఆలయ వార్షికోత్సవం


స్వామివారిని దర్శించుకున్న రమేష్‌రెడ్డి, భక్తులు

కొడంగల్‌ రూరల్‌: మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో శుక్రవారం బసవేశ్వర ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌ రమేష్‌రెడ్డి దేశ్‌ముఖ్‌ స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శివమాలధారణ పవిత్రమైనది

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు


ప్రహ్లాదరావును సన్మానించిన నిర్వాహకులు

కుల్కచర్ల: శివమాలధారణ అనేది అత్యంత పవిత్రమైనదని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని చాపలగూడెం గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం శివస్వాముల ఇరుముడుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రహ్లాదరావు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు కృష్ణారెడ్డి, గోపాల్‌ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల అందజేత


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలోని కొడంగల్‌ మండలంలో 7మంది, కోస్గి మండలంలో 8మంది, బొంరాస్‌పేటలో 11మంది, దౌల్తాబాద్‌ మండలంలో 11మంది, మద్దూర్‌ మండలంలో 14మందితో మొత్తం 51మంది లబ్ధిదారులకు రూ.16,89,800 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ మధుసూదన్‌ యాదవ్‌, సర్పంచ్‌లు సయ్యద్‌ అంజద్‌, వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్‌, ఫకీరప్ప, నాయకులు.. రాంరెడ్డి, సిద్దిలింగప్ప, ముక్తార్‌, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గౌస్‌


నియామకపత్రం అందుకుంటున్న గౌస్‌

పెద్దేముల్‌: వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్‌ షర్మిల గారి ఆదేశాల మేరకు పెద్దేముల్‌ మండల అడ్కిచెర్ల గ్రామానికి చెందిన ఎండీ.గౌస్‌ను వికారాబాద్‌ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం వికారాబాద్‌ జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు మామిడి సంగమేశ్వర్‌ చేతుల మీదుగా గౌస్‌కు నియామకపత్రం అందజేశారు. గౌస్‌ మాట్లాడుతూ.. జిల్లాలో వైఎస్సార్‌ టీపీని బలోపేతం చేస్తానన్నారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్‌ టీపీ గ్రామ కమిటీలు వేసి పార్టీని ముందుకు తీసుకెళ్తానన్నారు.

ఆర్థికసాయం అందజేత

దోమ: నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటామని రాకంచర్ల సర్పంచ్‌ పెంటయ్య అన్నారు. దోమ మండల పరిధిలోని గొడుగోనిపల్లి గ్రామానికి చెందిన తిమ్మని మొగులయ్య గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. సంవత్సరం క్రితం అతడి భార్య ప్రియాంక, తాజాగా అతడి తండ్రి తిమ్మని బుడ్డ రామయ్య మృతిచెందారు. అప్పటినుంచి మొగులయ్య తన ఇద్దరు పిల్లలను చూసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న అంబేడ్కర్‌ సంఘం తాలూకా అధ్యక్షుడు భాస్కర్‌ బాధితుడి కుటుంబాన్ని ఆదుకునేలా చూడాలని రాకంచర్ల సర్పంచ్‌ని కోరారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి వారు ఆర్థిక సహాయం అందించడంతోపాటు 20 కిలోల రేషన్‌ బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ పరిగి నియోజకవర్గ అధ్యక్షుడు బొంపల్లి రమేశ్‌ కుమార్‌, యువజన నాయకులు కృష్ణ, నర్సింహులు, సత్యయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరభద్రేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలు

పూడూరు: మండల పరిధిలోని కంకల్‌ గ్రామంలో వెలసిన వీరభద్రేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న రుద్రాభిషేకం, హరికథ, 19న ఆదివారం అగ్నిగుండం, 20న సోమవారం రథోత్సవం, సాయంత్రం వీరభద్ర విజయం నాటకం, 21న పార్వతీపరమేశ్వరుల కల్యాణం, రాత్రికి మానస పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు రామలింగేశ్వర ఆలయ జాతర

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని జినుగుర్తి శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ ప్రవీణ్‌గౌడ్‌ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహా శివారాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రయం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు శని త్రయోదశి

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఏన్కతలలో వెలసిన శనైశ్చరస్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. శివరాత్రి పర్వదినం రోజున శని త్రయోదశి కావడం చాలా పవిత్రత చోటు చేసుకుంటుందని భక్తుల విశ్వాసం. భక్తులు నువ్వుల నూనెతో అభిషేకాలు, సప్త వృక్షాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

ఓయూ సైకాలజీ విద్యార్థి హన్మంతు

కుల్కచర్ల: విద్యార్థులు ప్రశాంత వాతవరణంలో చదువుకోవాలని ఓయూ సైకాలజీ విద్యార్థి హన్మంతు అన్నారు. కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌ జెడ్పీ పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు.. పరీక్ష రాసే విధానం, ఒత్తిడిని తట్టుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన హన్మంతు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుకునే, పరీక్షలు రాసే సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లకు, సామాజిక మాధ్యమాలకు, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న హన్మంతు

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల


కేక్‌ కట్‌ చేస్తున్న చైర్‌పర్సన్‌ మంజుల, నేతలు

వికారాబాద్‌ అర్బన్‌: తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత కేవలం సీఎం కేసీఆర్‌కే సాధ్యమైందని వికారాబాద్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ చిగుళ్ల పల్లి మంజుల అన్నారు. కేసీఆర్‌ జన్మదినం సందర్భంగా శుక్రవారం మున్సిపల్‌ కార్మికులతో కలిసి ఆమె కేక్‌ కట్‌ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రతివర్గానికి న్యాయం చేస్తున్న గొప్పవ్యక్తి కేసీఆర్‌ అన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కేసీఆర్‌ కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైస్‌ చైర్‌పర్సన్‌ శంషాద్‌ బేగం, కౌన్సిలర్లు చందర్‌నాయక్‌, సిద్దులూర్‌ సర్పంచ్‌ అంజయ్య, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటు రాజకీయాలను భరించేది లేదు

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

మర్పల్లి: బీఆర్‌ఎస్‌ పార్టీలోనే ఉంటూ నన్ను, నాకు సంబంధించిన నేతలు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టేవారిని వదిలేది లేదని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్‌కేఆర్‌ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కేసీఆర్‌ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జరుపుకున్నారు. ముందుగా మండల కేంద్రంలో బైక్‌ ర్యాలీ తీశారు. అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత సొంత పార్టీలోనే ఉంటూ తమను, తమ కార్యకర్తలను ఇబ్బందులకు, అవమానాలకు గురిచేస్తున్నా భరిస్తూ వస్తున్నామని.. ఇకనుంచి వారి ఆటలు సాగవని స్పష్టం చేశారు. వెన్నుపోటు రాజకీయాలను భరించేది లేదన్నారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తాను అండగా ఉంటానని అన్నారు. అనంతరం ఎస్‌కేఆర్‌ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్‌ పోటీలను ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ట్రస్టు వ్యవస్థాపకులు కొండల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు నాగేందర్‌గౌడ్‌, సహకార సంఘం చైర్మన్‌ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఫసీ, మార్కెట్‌ కమిటీ ఉపాధ్యక్షుడు రామేశ్వర్‌, కోఆప్షన్‌ సభ్యులు సోహెల్‌, వికారాబాద్‌ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ రాంచెంద్రారెడ్డి, మర్పల్లి ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్‌, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.


మర్పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహేందర్‌రెడ్డి

ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం


ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని శ్రీబాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలోశుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పాఠశాలలో స్వరాష్ట్రం–స్వపరిపాలన నినాదం అనే అంశంపై తోటి విద్యార్థులకు బోధించారు. డీఈఓగా మౌనిక, డిప్యూటీ డీఈఓగా సాయి కీర్తన, ఎంఈఓగా శివరాథోడ్‌, హెచ్‌ఎంగా జస్వంత్‌కుమార్‌తోపాటు మరో 18మంది ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ విద్యాబోధన చేశారు. పాఠశాల కమిటీ ప్రధాన కార్యదర్శి జయతీర్థాచారీ, హెచ్‌ఎం వెంకటప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

కుల్కచర్ల: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రి కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్‌ చంద్రప్రకాష్‌ అన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని చాపలగూడెం, సక్రియానాయక్‌ తండా గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మాధవి, మహేశ్వరి, సర్పంచ్‌లు లక్ష్మణ్‌, రవి, వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

22న టెంకాయల వేలం

కుల్కచర్ల: ఈ నెల 22న పాంబండ దేవస్థానంలో టెంకాయల వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్‌ రాములు, ఆలయ ఈఓ సుధాకర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో జరగనున్న శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అట్టి బ్రహ్మోత్సవాల సమయంలో టెంకాయలు అమ్ముకొనుటకుగాను వేలం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 22న పాంబండ దేవాలయంలో జరిగే వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య

దోమ: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మేకల యాదయ్య కోరారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని ఐనాపూర్‌ జిల్లా పరిషత్‌ పాఠశాలలో యాదయ్య మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు తీసుకువచ్చేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలన్నారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శుభాన్‌, మేకల బాబయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాకు సమయం కేటాయించాలి

బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు ప్రవీణ్‌రెడ్డి

పరిగి: ధ్యానాసన యోగా శిక్షణ తరగతుల ద్వారా ఎన్నో ఆరోగ్య సూత్రాలను నేర్చుకున్నామని బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఫంక్షన్‌ హాల్‌లో పది రోజులపాటు నిర్వహించిన ధ్యానాసన యోగా శిక్షణ ముగింపు కార్యక్రమానికి శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం 5:30 నుండి 7గంటగల వరకు, సాయంత్రం 6గంటల నుంచి 7:30 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ తరగతులు ఏర్పాటు ఏసి ధ్యానం ఏలా చేయాలి, ఏ ఆసనాలు చేయడం ద్వారా ఏఏ ఉపయోగాలు ఉన్నాయన్న విషయాలను తెలుసుకున్నామన్నారు. శివానంద ఆచార్యులచే ఎన్నో యోగాసనాలను నేర్చుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ యోగా కోసం సమయం కేటాయించాలన్నారు.


ముగింపు సభలో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ అందజేత


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ అందజేస్తున్న నందు

బంట్వారం: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని బీఆర్‌ఎస్‌ రాష్ట నాయకుడు, స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్‌ వడ్ల నందు ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్‌ పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం ఆయన బంట్వారం మోడల్‌ స్కూల్‌, జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ (ఆల్‌ఇన్‌వన్‌) పుస్తకాలు పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్‌తో పాటు రూ.70 వేలు వెచ్చించి పాఠశాల గోడలకు పెయింటింగ్‌ వేయించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధారూరు పీఏసీఎస్‌ మాజీ చైర్మన్‌ హన్మంత్‌రెడ్డి, బంట్వారం, మాలసోమారం సర్పంచ్‌లు లావణ్య, నర్సింహారెడ్డి, యాచారం ఎంపీటీసీ ప్రశాంతి, మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ సరళారెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎం శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం

కుల్కచర్ల: చౌడాపూర్‌ మండలం మందిపల్‌ గ్రామంలోని శ్రీ ఓంకారేశ్వర దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం గీతావాహిని భక్త బృందం ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణాన్ని నిర్వహించారు. గణపతిపూజ, సర్వదేవాతపూజ నిర్వహించి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. మూడురోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సర్పంచ్‌ మఠం ప్రమీల కోరారు.


గీతాపారాయణంలో పాల్గొన్న భక్తబృందం

మార్కెట్‌లో నకిలీ అల్లంవెల్లుల్లి పేస్టు

- తయారీ కేంద్రం, దుకాణాలపై పోలీసుల దాడులు
- ప్రధాన నిందితుడు సహా ఇద్దరి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ అప్పయ్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పయ్య

బంట్వారం: ప్రజల ప్రాణాలకు హాని కలిగించే కల్తీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామని ధారూరు సీఐ అప్పయ్య హెచ్చరించారు. నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టు డబ్బాలు విక్రయిస్తున్న నిందితులను టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు శుక్రవారం కోట్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ధారూర్‌ సీఐ అప్పయ్య, మోమిన్‌పేట సీఐ వెంకటేశ్‌ మాట్లాడుతూ.. కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన కే.ప్రదీప్‌కుమార్‌, ఎండీ.అజీమోద్దీన్‌ నకిలీ అల్లంవెల్లుల్లి పేస్టును తమ దుకాణాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వీరిద్దరిని పట్టుకుని విచారించగా సంగారెడ్డి జిల్లా కంది మండలం జులకల్‌కు చెందిన మహ్మద్‌ వసీం అసలు సూత్రధారిగా తేలింది. కోట్‌పల్లికి చెందిన ప్రదీప్‌కుమార్‌, అజీమోద్దీన్‌ తక్కువ ధరకు మహ్మద్‌ వసీం దగ్గర అల్లం వెల్లుల్లి పేస్టు కొనుగోలు చేసి దుకాణాల్లో ఎక్కువ రేటుకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అసలు సూత్రధారి వసీం విచారించారు. జుల్కల్‌లోని అతడి ఇంట్లో నకిలీ అల్లంవెల్లుల్లి పేస్టు తయారీకి వినియోగిస్తున్న కెమికల్స్‌, యాసిడ్‌, నకిలీ అల్లంవెల్లుల్లి డబ్బాలు 5 కేజీలవి 84, 1 కేజీవి 330 డబ్బాలు, అర కేజీవి 560 డబ్బాలు, 180 గ్రాముల డబ్బాలు 560 స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 20 లీటర్ల అసిటిక్‌ యాసిడ్‌, 35 డబ్బాల బుష్‌ఫుడ్‌ కలర్‌ పట్టుకున్నారు. అలాగే కోట్‌పల్లికి చెందిన ప్రదీప్‌కుమార్‌, అజీమోద్దీన్‌ దుకాణాల్లో కూడా నకిలీ అల్లంవెల్లుల్లి పేస్టు డబ్బాలు 177 పట్టుబడ్డాయి. నిందితులు ప్రదీప్‌కుమార్‌, అజీమోద్దీన్‌తో పాటు మహ్మద్‌ వసీంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ సత్యనారాయణరాజు ,ఏఎస్‌ఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.